# ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియ

- పేదలకు మంచి విద్యను అందించడమే మా విధానం
- వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్
- డిఎస్‌సి ఫలితాల ప్రకటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఫలితాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రేవంత్, మంత్రులు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఉపాధ్యాయ వృత్తి అనేది ఉద్యోగం కాదని భావోద్వేగమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నిరుద్యోగమనేది తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉందని, నియామకాలే లక్ష్యంగా తెలంగాణ ఉద్యమం సాగిందన్నారు. తమ ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియ అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డిఎస్‌సి-2024 ఫలితాలను రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...కెసిఆర్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో కేవలం ఒకసారి డిఎస్‌సి నిర్వహించి 7,857 పోస్టులు భర్తీ చేస్తే, తమ ప్రజా ప్రభుత్వం పది నెలల్లోనే 11,062 పోస్టులకు డిఎస్‌సి నిర్వహించిందని తెలిపారు. ప్రతి పోస్టుకు 1:3 నిష్పత్తిలో ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు తొమ్మిదిన ఎల్‌బి స్టేడియంలో నియామక పత్రాలు అందజేస్తామని, ఆయా అభ్యర్థుల కుటుంబాల్లో దసరా పండగకు ముందే పండగ వాతావరణం నెలకొనేలా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత టెట్ నిర్వహించాలని నిరుద్యోగుల నుంచి విజ్ఞప్తి వస్తే మరోసారి టెట్ నిర్వహించగా డిఎస్‌సి రాసేందుకు అదనంగా 1,09,168 మంది అభ్యర్థులు అర్హత సాధించారని ముఖ్యమంత్రి చెప్పారు. డిఎస్‌సి రాత పరీక్షలను జులై 18వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు 26 సెషన్లలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) నిర్వహించినట్లు సిఎం తెలిపారు. డిఎస్‌సి, టెట్ నిర్వహణలో సమర్థంగా వ్యవహరించారని, బాగా కష్టపడ్డారని విద్యాశాఖ అధికారులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు.

**వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్**

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా తెలంగాణ వ్యాప్తంగా వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ గురుకుల పాఠశాలలు వేర్వురుగా ఉండడంతో పిల్లల్లో ఆత్మనూన్యత భావం ఏర్పేడదని.. దానిని తొలగించి వారి సమగ్ర వికాసానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో.. రూ.వంద కోట్లతో ఒక్కో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటికే కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైందని, ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పేదలకు విద్యను అందించాలనే ఆలోచన గత కెసిఆర్ ప్రభుత్వానికి లేదని, అందుకనే పదేళ్లలో కేవలం ఒక్క డిఎస్‌సి మాత్రమే వేశారని విమర్శించారు. గత ప్రభుత్వం విద్యా శాఖను నిర్లక్ష్యం చేసిందని, బడ్జెట్ కేటాయింపులు తక్కువగా చేసేదని, తాము అధికారంలోకి వచ్చాక విద్యాశాఖకు నిధుల కేటాయింపు పెంచామని, భవిష్యత్‌లో నిధులు మరింతగా కేటాయిస్తామని అన్నారు. గత ప్రభుత్వం కోళ్ల షెడ్లు, అద్దె గృహాల్లో వసతి గృహాలు ఏర్పాటు చేసిందని, కనీస మౌలిక వసతులు కల్పించలేదన్నారు. ప్రస్తుతం ఆయా వసతిగహాల్లో ఎదురవుతున్న సమస్యలపై కొన్ని పార్టీలకు చెందిన మీడియాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, పదేళ్ల ప్రభుత్వంలో ఉన్నవాళ్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతోనే ఆ సమస్యలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పుడు ఆయా పాఠశాలల్లో వసతులు లేవంటూ తమపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. అందుకే తమ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం ఏళ్ల తరబడి టీచర్ల ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఎటువంటి వివాదాలకు తావు లేకుండా బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టామని తెలిపారు. విద్యపై పెట్టేది ఖర్చు కాదని.. పెట్టుబడి అని తాము భావిస్తున్నామని స్పష్టం చేశారు. విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహిస్తామని ఓ ప్రశ్నకు ముఖ్యమంత్రి బదులిచ్చారు.

**ఉద్యోగ నియామకాలే లక్ష్యం**

నిరుద్యోగులకు అండగా నిలవడం, ఉద్యోగ నియామకాలే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలు అందించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. గ్రూప్ 1, 2, 3 పోస్టులను అంగడీ సరకుల్లా మార్చిన టిజిపిఎస్‌సిని ప్రక్షాళన చేశామన్నారు. ఎటువంటి లోపాలు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మొత్తంగా మొదటి ఏడాదిలోనే 60వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనరసింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, విద్యా శాఖ కమిషనర్ ఈవీ నరసింహారెడ్డి, అదనపు డైరెక్టర్ కె.లింగయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏచూరి సంస్మరణ సభలో మాట్లాడుతున్న టి సాగర్

## కమ్యూనిస్టు యోధుడు ఏచూరి

- ఆయన మరణం దేశానికి తీరని లోటు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం కమ్యూనిస్టు ఉద్యమాలతో పాటు భారతదేశానికి తీరని లోటని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై ఏచూరి నిశితంగా పరిశీలన చేసి తగిన పరిష్కారాలు చూపేవారన్నారు. నేపాల్ కమ్యూనిస్టు ఉద్యమం కూడా తన సలహాలను సూచనలు తీసుకున్నదని చెప్పారు. మహా మేధావి, సిద్ధాంతంపై పట్టు ఉన్న యోధుడు, బహుభాష కోవిదుడు అని కొనియాడారు. అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు రాజుల ఆశిరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ మాట్లాడారు. పేదల పక్షాన నిస్వార్థంగా పని చేస్తూ.. జీవితాలను త్యాగం వారు కమ్యూనిస్టులన్నారు. ఏచూరి జీవితాంగం ప్రజలు, దేశం కోసం పనిచేయడమే కాకుండా.. మరణం అనంతరం తన పార్థీవదేహాన్ని మెడికల్ కాలేజీకి ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌రామిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుంజనూరు ఆంజనేయులు, బాల్‌రామ్, నాయకులు గోవిందరాజ్, భరత్ కుమార్, కాశప్ప, శివకుమార్, మహేష్ కుమార్‌గౌడ్, వెంకటయ్య, నరహరి, మహ్మద్ అలీ, సిపిఐ నాయకులు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఆదాయం రెట్టింపు హామీ ఏమైంది..?

- బిజెపి నాయకులను ప్రశ్నించిన మంత్రి తుమ్మల

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపి ఆరోపణలు చేయడం వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి.. కాశీకి పోయినట్లుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. చాలా మంది రైతులకు రుణమాఫీ జరగలేదని బిజెపి నాయకులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. "రైతుల ఆదాయం రెట్టింపు కాదు కదా.. గత పదేళ్లలో పెరిగిన ఖర్చులతో పోల్చుకుంటే నికర ఆదాయం పెరగని వాళ్లందరి సమాచారం మీ దగ్గర ఉందా? స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేసి.. రైతులను ఆదుకోవాలంటూ రాజధాని వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న వారి విజ్ఞప్తులను ఎప్పుడైనా పట్టించుకున్నారా? బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలోనైనా రుణమాఫీ చేసి చూపించగలరా? రూ. లక్షల కోట్లు ఎగ్గొట్టిన పారిశ్రామికవేత్తల నుంచి నిధులు రికవరీ చేసి దేశవ్యాప్తంగా ఉన్న రైతుల రుణమాఫీ చేయగల నిబద్ధత మీకుందా? కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు భరోసా కల్పించే బాధ్యత మాది. ఇప్పటికే సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాం. పంటలన్నింటినీ మద్దతు ధరకే కొనుగోలు చేసేందుకు ఈ ప్రభుత్వం కృషి చేస్తుంది" అని తుమ్మల పేర్కొన్నారు.

## చెరువులు కాజేసిందే బిఆర్‌ఎస్ నేతలు

- పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

బిఆర్‌ఎస్ నేతల మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని తెలంగాణ పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు అన్యాయం చేస్తున్నామని దుమ్మెత్తి పోస్తున్న భారాస నేతలు.. అప్పట్లో రైతులకు బేడీలు వేసి తీసుకెళ్లలేదా? అని ప్రశ్నించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. "అన్ని పార్టీల ఎన్నికల అజెండాలో మూసీ ప్రక్షాళన ఉంది. మూసీ పరివాహకంలో ఇప్పటివరకు ఒక్క పేదవాడి ఇల్లు కూడా కూల్చలేదు. నది పక్కనున్న వ్యర్థాలను మాత్రమే తొలగించాం. దేశంలోనే అత్యంత కలుషితమైన నదిగా మూసీ నదికి పేరుంది. గడిచిన పదేళ్లలో 1500 చెరువులు కబ్జాకు గురయ్యాయి. ఎక్కువశాతం చెరువులను బిఆర్‌ఎస్ నేతలే కబ్జా చేశారు. అరగంట వాన పడితే హైదరాబాద్ పరిస్థితి దారుణంగా తయారవుతోంది. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నల్ల చట్టాలు తీసుకొచ్చి ఎంత మంది రైతులను పొట్టన పెట్టుకుందో అందరికీ తెలుసు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, హైదరాబాద్ జిల్లాల నుంచి విశ్రాంత ఉద్యోగులు గాంధీ భవన్ లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు తామెదుర్కొంటున్న ఇహెచ్‌ఎస్, పలు సమస్యల ఆయన దష్టికి తీసుకొచ్చారు. ఇహెచ్‌ఎస్ పథకం ద్వారా ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి భవిష్యత్తులోనూ సహకరించాలని ఆయన కోరారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ భవన నిర్మాణానికి సీఎంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పిజి లాసెట్‌లో 871 మందికి సీట్ల కేటాయింపు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పిజి లాసెట్ మొదటి విడత ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా సోమవారం సీట్లు కేటాయించారు. ఈ మేరకు లాసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లా కోర్సుల్లో కన్వీనర్ కోటాలో 961 పిజి సీట్లున్నాయని వివరించారు. 1,925 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. వారిలో 871 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఈనెల ఒకటి నుంచి ఐదో తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు కోరారు. ఈనెల తొమ్మిది నుంచి పీజీలా కోర్సుల్లో తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

## భారీగా గంజాయి సీజ్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

భద్రాచలం పట్టణంలోని పాత మార్కెట్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు 138 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా మహారాష్ట్రలోని ముంబయికి తరలిస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.37.5లక్షలు ఉంటుందన్నారు. గంజాయిని తరలిస్తున్న వ్యక్తితోపాటు కారు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## జపాన్ చేరిన డిప్యూటీ సిఎం భట్టి

- పలు కంపెనీలతో వ్యాపార చర్చలు

**ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో**

విదేశీ పర్యటనలో ఉన్న డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క బృందం సోమవారం అమెరికానుంచి జపాన్‌కు చేరుకుంది. హానిడా విమానాశ్రయంలో భారత రాయబార కార్యాలయ ప్రతినిధులు అజయ్ సేథి, మధుసూదన్, అమన్ ఆకాష్ స్వాగతం పలికారు. డిప్యూటీ సిఎం వెంట ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కే.రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి డి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండి ఎన్ బలరామ్ తదితరులు ఉన్నారు. ఈ బృందం మూడురోజులు జపాన్‌లోని పలు కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతుంది. రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆహ్వానిస్తారు. ఇక్కడ పర్యావరణహిత పరిశ్రమలు, అత్యాధునిక మైనింగ్ టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలిస్తారు. మూడు రోజుల పర్యటనలో సోమవారం భారత రాయబారి సీబీ జార్జి డిప్యూటీ సీఎం బృందానికి జపాన్ దేశంలోని పరిశ్రమలు, తెలంగాణలో పెట్టుబడులు, భాగస్వామ్య పరిశ్రమలకు ఉన్న అవకాశాలను సంక్షిప్తంగా వివరించారు. అనంతరం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి గౌరవార్థం భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన విందులో భట్టి విక్రమార్క ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అక్టోబర్ ఒకటవ తేదీ ఉదయం పెట్టుబడులతో వచ్చే కంపెనీలతో రౌండ్ టేబుల్ సమావేశం, వివిధ పారిశ్రామిక వేత్తలతో విడివిడిగా సమావేశాలు, అదేరోజు సాయంత్రం యమాంషి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌ను ఉప ముఖ్యమంత్రి బృందం సందర్శిస్తుంది. రెండవ తేదీ తోషిబా, కవాసాకి, యాక్లహామ పరిశ్రమలను సందర్శిస్తారు. అదే రోజు రాత్రి ఒకాస చేరుకోని మూడవ తేదీ పానాసోనిక్ హెడ్ క్వార్టర్స్ సందర్శిస్తారు. అనంతరం నాలుగో తేదీ హైదరాబాద్‌కు చేరుకుంటారు.

## జోకర్లుగా కెటిఆర్, హరీశ్ రావు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ధ్వజం

**హైదరాబాద్ బ్యూరో :** మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఆలోచించి మాట్లాడాలని, వారి మాటలు వింటుంటే వారు జోకర్లని ఇట్టే అర్థమవుతుందని అన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి తగిన ఓట్లు రాకపోవడం వల్లనే హైడ్రా పేరుతో కూల్చివేతలు చేస్తున్నారని కేటీఆర్, హరీశ్ రావు.. చేసిన వ్యాఖ్యలపై పై విధంగా స్పందించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్.. గజ్వేల్ ముంపు భూములపై తాము అడగడానికి వెళ్తే మధ్యలోనే తమను అడ్డగించి మూడు గంటలు అటు.. ఇటు.. తిప్పి 12 గంటల పాటు అరెస్టు చేశారని గుర్తుచేశారు. కాళేశ్వరంపై కమిషన్‌కు ఇంజనీర్లు కూడా సమాధానం చెప్పే పరిస్థితి లేదన్నారు. హైడ్రా ద్వారా పేదల ఇండ్లను కూల్చబోమని, అక్రమ కట్టడాలను మాత్రమే కూలుస్తామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్న వాటిని మాత్రమే కులుస్తున్నారని తెలిపారు. కాగా, దసరా తర్వాత జరగబోయే మంత్రి వర్గ విస్తరణలో మంత్రిగా వచ్చే అవకాశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. మంత్రి పదవిపై తనకు ఆశ లేదని అన్నారు. మంత్రి పదవి కావాలని అడగబోమని, కానీ అధిష్టానం ఇస్తే కాదనని తాను పదేండ్లు మంత్రిగా, ఐదేండ్లు మండలి నాయకునిగా పనిచేశానని తెలిపారు. మంత్రి పదవులు తనకు కొత్త కాదని, మంత్రి పదవి విషయంలో అధిష్టానం నిర్ణయమే తుది నిర్ణయమని తేల్చి చెప్పారు.

## ప్రయివేటు స్కూల్ టీచర్లకూ దసరా సెలవులు వర్తింపజేయాలి

- విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డికి టిపిటిఎల్‌ఎఫ్ వినతి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకూ దసరా సెలవులను వర్తింపజేయాలని తెలంగాణ ప్రయివేటు టీచర్లు, లెక్చరర్ల ఫెడరేషన్ (టిపిటిఎల్‌ఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఇవి నరసింహారెడ్డిని సోమవారం ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎ విజయ్‌కుమార్, నాయకులు డి సైదులు కలిసి వినతిపత్రం సమర్పించారు. బుధవారం నుంచి రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించిందని తెలిపారు. ఆ సెలవులు విద్యార్థులకే కాకుండా, ఉపాధ్యాయులకూ వర్తిస్థాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులకు మాత్రమే సెలవులిచ్చి, ఉపాధ్యాయులకు వర్తింపజేయడం లేదని వివరించారు. సెలవు దినాల్లో ఉపాధ్యాయులకు వర్క్‌షాప్‌లు లేదా ఇతర పనులు చెప్పి విద్యాసంస్థలకు రమ్మంటున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకూ సెలవులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామనీ, తగు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

## దీక్షలు ఢిల్లీలో చేయండి

- ప్రచారం ఎక్కువ...పనితక్కువ
- బిజెపిపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫైర్

**ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో**

రైతు రుణమాఫీపై రాష్ట్ర బిజెపి నాయకత్వం చేస్తున్నది ప్రచారార్భాటమే తప్ప, సమస్యల పరిష్కారంపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. రుణమాఫీపై దీక్షలు చేస్తున్నట్టు నగరం అంతా హోర్డింగ్స్ ఏర్పాటు చేసుకున్నారనీ, వాళ్లకు అంత సీన్ లేదని అన్నారు. ఇందిరాపార్కు వద్ద దీక్షలు చేస్తూ, నగరమంతా హోర్డింగ్స్ పెట్టుకోవడంలోనే వారి చిత్తశుద్ధి ఏపాటితో అర్థమవుతుందని చెప్పారు. ఏవైనా దీక్షలు చేసేది ఉంటే ఢిల్లీ వెళ్లి బిజెపి కేంద్ర కార్యాలయంలో చేయాలని సలహా ఇచ్చారు. సోమవారంనాడిక్కడి అసెంబ్లీ ప్రాంగంణంలోని కాంగ్రెస్ శాసనసభాపక్ష కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తెచ్చి, తప్పనిసరి పరిస్థితుల్లో వెనక్కి తీసుకున్నారని చెప్పారు. ఇప్పటికీ రైతులకు కనీస మద్దతు ధర చట్టం తేలేదని గుర్తుచేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రైతు రుణమాఫీ చేశారేమో చెప్పాలని ప్రశ్నించారు. అదానీ, అంబానీలకు రూ. లక్షల కోట్లు రుణమాఫీ చేశారనీ, రైతులకు ఎందుకు చేయరని ప్రశ్నించారు. రైతుబంధు, రైతు భరోసా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలు చేస్తున్నారా? అని అడిగారు. సత్తాలేని రాష్ట్ర బిజెపి నాయకులు ఇక్కడి ప్రభుత్వంపై ప్రజలు విశ్వసించని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ ప్రకటించి, అమలు చేస్తున్నదనీ, కొన్ని చోట్ల చిన్నచిన్న సమస్యలు ఎదురైతే, వాటిని పరిష్కరించి, వందశాతం రుణమాఫీ చేస్తామని రైతాంగానికి భరోసా ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర బీజేపీ నేతలకు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నదే తప్ప, వారికి సమస్యల పరిష్కారంపై ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. హైడ్రా అక్రమ నిర్మాణాలను మాత్రమే కూల్చివేస్తున్నదనీ, ఆ పనులను గత ప్రభుత్వం కూడా చేసిందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నిరాశ్రయులందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇచ్చి, మెరుగైన జీవితాన్ని అందిస్తున్నామని చెప్పుకొచ్చారు.

## కీర్తిలాల్స్ డైరెక్టర్ శాంత కుమార్‌కు జిజెసి అవార్డు

**ప్రజాశక్తి - హైదరాబాద్ :** ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ అయినా కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంత కుమార్‌కు ఐకాన్ ఆఫ్ ది జ్యువెలరీ ఇండస్ట్రీ 2024 అవార్డు దక్కినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జిజెసి) ఈ అవార్డును ప్రధానం చేసింది. ఆభరణాల పరిశ్రమకు అందించిన విశేషమైన సేవలకు గుర్తింపుగా, డిజైన్, నవ్యావిష్కరణ, వ్యాపార నాయకత్వాల్లో కీలకమైన నైపుణ్యాలకుగాను ఈ అవార్డును పొందారు.

## పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- అప్రమత్తంగా ఉండండి : టిజిసిపిడిసిఎల్ సిఎండి



**ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో కూడా రబీ సీజన్ స్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నదనీ, అందువల్ల విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారూఖీ అధికారులను హెచ్చరించారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను పునరుద్ధరించాలనీ, ఎక్కడ ఎలాంటి సమస్యలు ఎదురైనా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సోమవారంనాడాయన సూపరింటెండింగ్ ఇంజనీర్లు, చీఫ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ పరిధిలో గతేడాది ఖరీఫ్ సీజన్‌లో గరిష్ట డిమాండ్ 9,862 మెగావాట్లు కాగా, ఈసారి 9,910 మెగావాట్లకు చేరిందని చెప్పారు. ఈ సీజన్ ముగిసే నాటికి గరిష్ట డిమాండ్ పదివేల మెగావాట్లకు పైగా నమోదయ్యే అవకాశం వున్నదనీ, విద్యుత్ వినియోగం 200 మిలియన్ యూనిట్లకంటే పెరుగుతుందని అంచనా వేశామన్నారు. రాష్ట్రంలో గతేడాది ఖరీఫ్ సీజన్‌లో అత్యధిక డిమాండ్ 15,370 మెగావాట్లు నమోదు కాగా, ఈ ఏడాది సెప్టెంబర్ 20వ తేదీ 15,570 మెగావాట్లుగా నమోదయ్యిందని వివరించారు. ఫీడర్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ లేకుండా, ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని చెప్పారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అత్యధిక విద్యుత్ వినియోగం 292.51 మిలియన్ యూనిట్లు కాగా, ఈ ఏడాది 303.82 మి.యూ.,గా నమోదైందని చెప్పారు.

## కుటుంబ సభ్యులు సమ్మతిస్తేనే ఫొటో

- సిఎం రేవంత్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న ప్రక్రియను సమర్థంగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఒక వేళ పూర్తిగా పట్టణ/నగర నియోజకవర్గమైతే రెండు వార్డులు/ డివిజన్లు, పూర్తిగా గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాల్లో మొత్తంగా 238 ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. వార్డులు/ డివిజన్లలో జనాభా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిశీలన బృందాల సంఖ్యను పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయం లో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిట్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు, సేకరించే వివరాలను అధికారులు వివరించారు. 119 నియోజక వర్గాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్న గ్రామాలు, వార్డులు/డివిజన్ల ఎంపిక పూర్తయిందని అధికారులు సిఎంకు వివరించారు. పైలెట్ ప్రాజెక్టును ఎన్ని రోజుల పాటు చేపడతారని సిఎం ప్రశ్నించారు. అక్టోబరు మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకు అయిదు రోజుల పాటు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంతా సమ్మతిస్తే కుటుంబం ఫొటో తీయాలని, అదో అప్షనల్‌గా ఉండాలని, కుటుంబం సమ్మతి లేకుంటే ఆ ఫొటో తీసుకోవాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు సంబంధించి ఉమ్మడి జిల్లాలకు ఉన్న నోడల్ అధికారులు కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయాలని.. అప్పుడే పకడ్బందీగా కార్యక్రమం కొనసాగుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వద్దనున్న రేషన్ కార్డు, పింఛను- స్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రుణమాఫీ, బీమా, ఆరోగ్య శ్రీ, కంటి వెలుగు తదితర డేటాల ఆధారంగా ఇప్పటికే కుటుంబాల గుర్తింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, పైలెట్ ప్రాజెక్టులో దానిని నిర్ధారించుకోవడంతో పాటు కొత్త సభ్యులను జత చేయడం, మృతి చెందిన వారిని తొలగించడం చేస్తామని అధికారులు వివరించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులుచేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వవద్దని హెచ్చరించారు.

**మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో**

**O.S. No. 357/2015**

బిట్వీన్ :
Gummadi Jyothi Lakshmi .... వాది
ఎదిరి
Kurra Bharathi and others ....ప్రతివాదులు

**To,**
**D10 :** Velagapudi Sivarama Krishna S/o Tirupathi Rao,
**D11 :** V.Bhavani Shankar, S/o Siva Rama Krishna,
**D12 :** V.Suresh S/o Siva rama Krishna
All are R/o H.No. 6-458/92, Madhusudhana Reddy Nagar, Near K.M.G. Function Hall, Chintal, HMT Township, Hyderabad - 500054.

పై నెంబరులో వాది మీపై సదరు కోర్టులో డిక్లరేషన్ కొరకు దావా దాఖలు చేసి యున్నందున మీ హాజరు నిమిత్తం ది. 14-10-2024వ తేదీకి వాయిదా వేసివున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరఫు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా : 14-10-2024

శ్రీ కొరటాల నరసింహారావు,
వాది తరఫు అడ్వకేట్, తెనాలి
సెల్ నెం. 98486 11435.

# మెదక్ మున్సిపల్ కమిషనర్‌పై భార్య ఫిర్యాదు

- మరో పెళ్లి చేసుకున్నారంటూ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్.. మరో మహిళను పెళ్లి చేసుకున్నాడని అతని భార్య కల్యాణి ఒయు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త మరో పెళ్లి చేసుకుంటున్నాడని తెలియడంతో నిలదీసిన కళ్యాణిని జానకిరామ్ హత్య చేస్తానంటూ కారులో తీసుకెళ్లినట్టు కల్యాణి కుటుంబ సభ్యులు డయల్ 100కు సమాచారం అందించారు. దాంతో హబ్సిగూడ వద్ద జానకిరామ్ సాగర్‌ను ఒయు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ ఇప్పటి వరకు మూడు పెళ్లిళ్లు చేసుకున్నారంటూ అతని భార్య కల్యాణి ఒయు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# 'ఔటర్'పై డివైడర్‌ను ఢీ కొట్టిన కారు

- డాక్టర్ మృతి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రంగారెడ్డి జిల్లా హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్‌పై సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న నిలయ రెడ్డి (42) సోమవారం ఉదయం నాలుగు గంటల సమయంలో శంషాబాద్ నుంచి గచ్చిబౌలికి ఔటర్ రింగ్ రోడ్‌పై కారు డ్రైవింగ్ చేస్తూ వెళుతున్నారు. అయితే హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద అతి వేగంగా వచ్చి డివైడర్‌ని ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు నడుపుతున్న నిలయరెడ్డి ఓఆర్ఆర్‌పై నుంచి కింద చెట్ల పొదల్లో పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# డెంగ్యీతో మహిళ మృతి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

డెంగ్యీతో మహిళ ప్రాణం కోల్పోయింది. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా లోకేశ్వరం మండలంలోని బాగపూర్ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బైరి శ్రీలత(24)కు ఐదు రోజుల కిందట జ్వరం వచ్చింది. ఆమెను భర్త వినీత్ నిర్మల్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు డెంగ్యీ జ్వరం వచ్చినట్టు చెప్పారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకువెళ్లాలని సూచించడంతో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. వారికి ఇద్దరు కుమారులు (పెద్ద కుమారుడు 3 సంవత్సరాలు, చిన్న కుమారుడు 4 నెలలు) ఉన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాయడం దేశద్రోహమే

- వారి శ్రమలేకుంటే అభివృద్ధి అసాధ్యం
- కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగభద్రత, హక్కులు కల్పించాల్సిందే : సాయిబాబు
- యాజమాన్యాల ఒత్తిడితోనే కనీస వేతనాలు పెంచడం లేదు : పాలడుగు

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

ధర్నాలో అభివాదం చేస్తున్న సిపిఎం నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు

పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల కోసం పాలకులు కార్మికుల హక్కులను కాలరాయడం దేశద్రోహమే అవుతుందని సిఐటియు అఖిలభారత కోశాధికారి ఎం సాయిబాబు స్పష్టం చేశారు. దేశంలో కార్మికులకు భద్రత లేకుంటే పారిశ్రామిక రంగానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం ఉండదని నొక్కి చెప్పారు. కార్మికులు, కూలీలు లేకుండా దేశ అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దేశాభివృద్ధిలో కీలకంగా మారిన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఇతర విభాగాల కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, హక్కులు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీసవేతనాలివ్వాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ కార్మికులకు భద్రత, యూనియన్లు అవసరం లేదన్నట్టు కేంద్రంలోని బిజెపి కూటమి ప్రభుత్వం వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. కార్మికులు లేకుంటే పారిశ్రామిక వేత్తలకు బతుకు లేదనీ, దేశ ఆర్థిక వ్యవస్థ నిలబడదని చెప్పారు. ప్రతి రంగంలోనూ కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారనీ, వారి శ్రమ లేకుండా దేశ ఆర్థిక వ్యవస్థ ఎదగడం ఎలా సాధ్యమని ప్రధానిని ప్రశ్నించారు. పోరాటాల ద్వారా సాధించుకున్న కనీసవేతనాలు, గ్రాట్యూటీ, పీఎఫ్, బోనస్ తదితర హక్కులను మోడీ సర్కారు కోడ్‌లతో పేరుతో కాలరాయాలని చూస్తున్నదని విమర్శించారు. 8 గంటల పనివిధానాన్ని 12 గంటకు పెంచడం దుర్మార్గమన్నారు. యజమానులకు అనుకూలంగా కార్మిక శాఖను మార్చటాన్ని తప్పుబట్టారు. పర్మినెంట్ ఉద్యోగ వ్యవస్థను క్రమంగా తగ్గిస్తూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, క్యాజువల్, తాత్కాలిక, డైలీవేజ్, అప్రెంటీస్, పీస్ రేటెడ్, హోం బేస్డ్ వర్కర్ల విధానాలతో కార్మికులతో శ్రమదోపిడీకి గురవుతున్నారని వాపోయారు. మోడీ సర్కారు అప్రెంటీస్‌లను 30శాతం పెంచుకోడానికి అవకాశం ఇచ్చిందని విమర్శించారు. ఆరు, మూడు నెలల కాలానికి ఒప్పందంతో ట్రైనీ వ్యవస్థను విస్తరిస్తూ శాశ్వత కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తున్నతీరును వివరించారు. దీంతో రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య ఐదు శాతానికి పడిపోయిందన్నారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు రాయితీలమీద రాయితీలు ఇస్తూ పోతున్నదిగానీ ఉత్పత్తిలో కీలకంగా ఉన్న కార్మికులకు సంబంధించిన కనీస వేతనాలను మాత్రం పెంచడం లేదని విమర్శించారు. వలస కార్మిక చట్టం ప్రకారం వేతనాలు, ఉద్యోగ భద్రత, నివాసం, ఆరోగ్యం లాంటి సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. వారికి రక్షణ కల్పించే చర్యలకు కార్మిక శాఖ పూనుకోవాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఇతర విభాగాల కార్మికులకు సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాల్సి ఉండగా కార్మిక శాఖ రూ.18 వేలు నిర్ణయించిందని, యాజమాన్యాల ఒత్తిడితో దాని నుంచీ కాంగ్రెస్ సర్కారు వెనక్కి తగ్గిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఇతర విభాగాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలనీ, వారికి ఉద్యోగ భద్రత కల్పించి రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఎస్‌వి రమ, జె మల్లిఖార్జున్, కె ఈశ్వర్‌రావు, జె చంద్రశేఖర్, విఎస్ రావు, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, సీనియర్ నాయకులు పి రాజారావు, రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేష్, బి మధు, పద్మశ్రీ, కూరపాటి రమేష్, ఎం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా హక్కుల కోసం నిరంతర పోరాటం

- సవాళ్లను అధిగమించాలి
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మహిళా హక్కుల కోసం నిరంతరం పోరాడుతూనే ఉండాలని, సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. సోమవారం హైదరాబాద్ ఐద్వా హైదరాబాద్ సౌత్ జిల్లా 3వ మహాసభ సంతోష్‌నగర్‌లోని ఆలం కుందుమిరి ఆఫీసులో నిర్వహించారు. అలాగే, ఐద్వా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 3వ మహాసభ జిల్లా అధ్యక్షులు నన్నపనేని సృజన అధ్యక్షతన ఇసిఎల్ కమలానగర్ భాస్కర్‌రావు భవన్ జిల్లా ఆఫీస్‌లో జరిగింది.

మహాసభలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

ఈ మహాసభల్లో మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు విద్య, వైద్యం, రాజకీయాలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకెళ్తూ విజయాలు సాధిస్తున్నా.. మరోవైపు వివక్ష, అణచివేత కొనసాగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు ప్రతి ప్రజా పోరాటంలోనూ ఎన్నో త్యాగాలు చేశారని, చేస్తున్నారని తెలిపారు. తమకు న్యాయంగా రావాల్సిన హక్కులు, అధికారాలను ఇప్పటికీ సంపూర్ణంగా అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ఏం తినాలి, ఏ బట్ట కట్టుకోవాలి అనే విషయాలనూ బిజెపి నాయకులు శాసిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలపై లైంగికదాడులు, హత్యలు జరుగుతుంటే నిందితులకు ఆ పార్టీ నాయకులు అండగా ఉంటున్నారని విమర్శించారు. హత్రాస్, ఉన్నావో, మహిళా క్రీడాకారులపై లైంగిక దాడులే దీనికి నిదర్శనం అన్నారు. మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గించి మహిళలకు ఉపాధి పెంచేందుకు ప్రభుత్వాలు పూనుకోవాలని, మహిళా శక్తికి తగిన విధంగా అవకాశాలు కల్పించే ఆర్థిక, సామాజిక విధానాలను రూపొందించాలని కోరారు. మహిళలు లేకుండా అభివృద్ధి లేదని, సమానత్వం లేకుండా సాధికారత లేదని, అందుకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి భవిష్యత్‌లో సమరశీల పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

# బిఆర్ఎస్ నేతలు అసహనంతో మాట్లాడుతున్నారు

- మంత్రి కొండా సురేఖ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మహిళా మంత్రిని అని కూడా చూడకుండా అవమానిస్తూ తనపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ సోషల్ మీడియా శ్రేణులు దారుణమైన పోస్టులు పెట్టాయని అన్నారు. అధికారం కోల్పోయిన బాధలో బిఆర్ఎస్ నేతలు ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదని, కవితపట్ల ఎవరైనా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే.. కెటిఆర్ సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. డబ్బులిచ్చి మహిళలను ట్రోల్ చేయించడం సరికాదని హెచ్చరించారు. సోమవారం మంత్రి సురేఖ హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. "మొదట్నుంచి మహిళలను కేటీఆర్ దారుణంగా అవమానిస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తే.. బస్సుల్లో డిస్కో డ్యాన్స్ చేస్తున్నారని అవమానించారు. చేనేత కార్మికులకు కెటిఆర్, బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. ప్రభుత్వ విధానాల పరంగా ఎన్ని విమర్శలు చేసినా తట్టుకుంటాం.

బాధిత కుటుంబాలకు చెక్కును అందజేస్తున్న హరీశ్‌రావు

# బతుకు ముఖ్యమా.. సుందరీకరణ ముఖ్యమా?

- మాజీ మంత్రి హరీశ్ రావు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

'పేద ప్రజల బతుకులు ముఖ్యమా.. మూసీ నది సుందరీకరణ ముఖ్యమా.. మీ నిర్ణయం వల్ల ప్రజలు రోడ్డున పడ్డారు' అని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సిద్దిపేట నియోజకవర్గ ఆటో కార్మికులకు యూనిఫారమ్‌లు, మృతి చెందిన కుటుంబాలకు ఇన్సూరెన్స్ చెక్కులను హరీశ్ రావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 1.50 లక్ష కోట్లతో మూసీ సుందరీకరణను సిఎం రేవంత్ రెడ్డి చేయనున్నారని, అది ఎవరికైనా ఉద్యోగం ఇస్తుందా, ఆదుకుంటుందా అని ప్రశ్నించారు. 25 వేల ఇళ్లు కూల్చేస్తామనడంతో ఎన్నో ఏళ్లుగా ఇళ్లు కట్టుకొని నివసిస్తున్న పేద ప్రజలు కన్నీరు మున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్లలో పిల్లలకు పురుగుల అన్నం, నీళ్ల చారు దిక్కయిందని, అవ్వలకు పింఛన్లు రావడం లేదని వారికి ఆ డబ్బులు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు అతీగతీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం వల్ల ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని, ప్రతి ఆటో కార్మికునికి నెలకు రూ.పది వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ప్రకటించినట్టుగా ఆటో కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 56 మంది ఆటో కార్మికులు చనిపోతే ఒక్క కుటుంబాన్ని పరామర్శించలేదని, ఆదుకోలేదని ఆరోపించారు. సిద్దిపేట ఆటో సొసైటీ దేశానికే ఆదర్శమని, రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తున్నామని, అవసరం ఉన్న వారికి తక్కువ వడ్డీకి రుణం అందిస్తున్నామన్నారు. రూ.2.10 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ రాజనర్సు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, నాయకులు, ఆటో యూనియన్ నాయకులు సంపత్ రెడ్డి, లక్ష్మణ్, మల్లేశం, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్‌గా వృత్తి ధర్మాన్ని చాటుకున్న ఎమ్మెల్యే

- 15 కేజీల గడ్డను తొలగించిన తెల్లం

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు మరోసారి తన వృత్తి ధర్మాన్ని పాటించి రోగి కడుపులో ఉన్న 15 కేజీల గడ్డను తొలగించి ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకెళ్తే.. భద్రాచలం పట్టణంలోని ఎమ్మెల్యే సొంత ఆస్పత్రి అయిన నిఖిత హాస్పిటల్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం జగ్గవరం గ్రామానికి చెందిన కుంజ రత్తమ్మ (51) తీవ్రమైన కడుపునొప్పితో ఇబ్బంది పడుతూ సోమవారం చేరింది. రోగి పరిస్థితిని గమనించిన డాక్టర్ తెల్లం.. అవసరమైన స్కానింగ్, పరీక్షలు నిర్వహించగా, ఆమె కడుపులో సుమారు 15 కేజీల బరువు గల నీటి గడ్డ ఉన్నట్టు గుర్తించారు. అప్పటికే తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్న రోగి వెంటనే ఆపరేషన్ చేయకపోతే ఆమె ప్రాణాలకే అపాయమని గ్రహించిన ఎమ్మెల్యే.. బాధితురాలైన రత్తమ్మకు తన ఆస్పత్రిలోనే సుమారు రెండు గంటల పాటు శ్రమించి ఆపరేషన్ నిర్వహించి ఎంకడుపులోని గడ్డను తొలగించారు. ఓ పక్క ఎమ్మెల్యేగా.. ప్రతిరోజు పలు కార్యక్రమాల్లో క్షణం తీరిక లేకుండా గడుపుతున్న తెల్లం.. అవకాశం వచ్చినప్పుడల్లా తన వైద్య వృత్తికి న్యాయం చేస్తూ ఇటువంటి అరుదైన ఆపరేషన్లను నిర్వహిస్తూ ఏజెన్సీ ప్రాంతంలో ప్రజల ప్రాణాలను కాపాడటం పట్ల పలువురు అభినందిస్తున్నారు. ప్రజా ప్రతినిధిగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడినందుకు బాధితురాలు రత్తమ్మ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# గురుకుల అద్దె భవనాల బకాయిలు చెల్లించాలి

- లేదంటే తాళాలు వేస్తాం
- రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రయివేటు భవన యాజమాన్య సంఘం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న సంఘం సభ్యులు

గురుకులాల అద్దె భవనాల బకాయిలు తక్షణమే చెల్లించాలని లేనిపక్షంలో వాటికి తాళాలు వేస్తామని రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రయివేటు భవన యాజమాన్య సంఘం హెచ్చరించింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు ఎ దేవేందర్‌రెడ్డి, సలహాదారులు కొండ దేవయ్య, పటేల్ మాట్లాడారు. గురుకుల విద్యాలయ ప్రయివేటు భవన యాజమాన్యాలకు 30 నెలలుగా అద్దె బకాయి ఉందని, తక్షణమే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 950 గురుకులాలు, 150 జ్యోతిరావు పూలే గురుకులాలు, మొత్తం 1100 అద్దె భవనాలున్నాయని, సుమారు రూ. 500 కోట్ల బకాయి ఉందని చెప్పారు. నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకు ఒకసారి అగ్రిమెంట్ చేసి అద్దెలు పెంచే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. దసరా సెలవుల్లో తమతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో అక్టోబర్ 15వ తేదీ అనం తరం హాస్టళ్లకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే తాము మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో పాటు అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి బండి కుమారస్వామి, కోశాధికారి సిహెచ్ కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నయీమ్ నగర్ బ్రిడ్జి నిర్మాణంపై దుమారం

- కెటిఆర్ వ్యాఖ్యల పై 'నాయిని' సవాల్..
- బిఆర్ఎస్ నేతల హల్‌చల్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

'నయీమ్‌నగర్ బ్రిడ్జి మేం కడితే ఎమ్మెల్యే ఎంజాయ్ చేస్తున్నాడని..' బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ వ్యాఖ్యానించడం రాజకీయ దుమారానికి తెరలేపింది. దీనిపై వరంగల్ పశ్చిమ కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందిస్తూ.. 'నయీమ్‌నగర్ బ్రిడ్జి ఎవరు నిర్మించారో తెలుసుకోవాలంటే ఆ బ్రిడ్జి వద్దకు రావాలని..' సవాల్ విసిరారు. దీనిపై బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కెటిఆర్‌గాని, ఆ పార్టీ నేతలు గాని స్పందించలేదు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. నయీమ్‌నగర్ బ్రిడ్జి వద్దకు చేరుకొని 'నయీమ్‌నగర్ బ్రిడ్జి ఎవరు నిర్మించారు' అని బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న వాహనదారులను అడగడంతో వారందరూ కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నిర్మించారని అన్నారు. 'నాయిని', మాజీ మంత్రి కేటీఆర్‌కు సవాల్ విసిరిన నేపథ్యంలో బీఆర్ఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు, మాజీ ఛీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కార్యకర్తలతో సోమవారం నయీమ్‌నగర్ బ్రిడ్జి వద్దకు వచ్చి ఎమ్మెల్యే 'నాయిని' విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మేయర్ గుండు సుధారాణి నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు సైతం అక్కడికి చేరుకోవడంతో ఇరు పార్టీల శ్రేణుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. వినయ్‌భాస్కర్ డౌన్‌డౌన్ అంటూ, వినయ్‌భాస్కర్ భూ కబ్జాదారుడు, చెన్నైకి తరిమికొడుతం అంటూ కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు. దీనికి ప్రతిగా బిఆర్ఎస్ శ్రేణులు రాజేందర్‌రెడ్డి ఖబర్దార్ అంటూ ప్రతినినాదాలు చేశారు. దాంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి 'దాస్యం'ను అదుపులోకి తీసుకొని పార్టీ కార్యాలయంలో వదిలేశారు.

గత ప్రభుత్వం నయీంనగర్ బ్రిడ్జికి నిధులు మంజూరు చేసినా విడుదల చేయలేదు. హన్మకొండ డిసిసి అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.84 కోట్లు విడుదల చేయించారు. అంతే వేగంగా ఏప్రిల్ 9వ తేదీన పనులు ప్రారంభించి యుద్ధప్రాతిపదికన నాలుగు నెలల్లో అంటే ఆగస్టులోపు పనులు పూర్తి చేయించడంతో 'నాయిని' క్రియాశీలతపై నగరవాసుల్లో హర్షం వ్యక్తమైంది. దాంతో బిఆర్ఎస్ శ్రేణులు ఆత్మరక్షణలో పడ్డాయి. ఇదిలావుంటే పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కాళోజీ కళాక్షేత్రాన్ని తమ హయాంలో పూర్తి చేసి ప్రారంభించలేకపోయింది. ఇది ఒకరకంగా ఆ పార్టీకి ఇబ్బందికరంగానే పరిణమించింది. దాంతో బిఆర్ఎస్ శ్రేణులు ఆత్మరక్షణలో పడ్డాయి. జిల్లా బిఆర్ఎస్ శ్రేణులు ప్రేక్షకపాత్ర వహించడంతో మాజీ మంత్రి కెటిఆరే స్వయంగా దీనిపై వ్యాఖ్యలు చేయాల్సి రావడం గమనార్హం.

# జాషువా సాహిత్యం దళితుల ఆవేదనా ప్రతిధ్వని

**ప్రజాశక్తి కల్చరల్**

జాషువా రాసిన గబ్బిలం కావ్యం తో పాటు ఇతర కవితలు అన్నిటిలో దళితుల ఆవేదనా ప్రతిధ్వని వినిపిస్తుందని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు . సోమవారం త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా జాషువా యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొని తెలుగు సాహిత్యంలో తొలి దళిత కవిత్వానికి ప్రథముడు జాషువా అన్నారు.అయన సులువైన పదాలతో భావాన్ని సూటిగా చెప్పగల ప్రతిభావంతుడు అని వివరించారు. కవి జల్ది విద్యాధరరావు మాట్లాడుతూ జాషువా రాసిన శిశువు కవితలు హదయన్ని తాకుతాయని చెప్పారు. తన కవిత్వాన్ని మెచ్చుకున్నవారే తనది ఏ కులమని అడిగి దూరంగా జరిగిపోయారని నాటి పరిస్థితులను అవేదన భరితంగా తన కవితలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో సాహితీ వేత్త ఆచార్య కోయి కోటేశ్వర రావు, సుధాకర్ భవాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తున్న సిపిఎం నాయకులు

# పేదల ఇళ్లను కూల్చొద్దు

- బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం
- సిపిఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్
- సిపిఎం, మూసీ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చే ప్రతిపాదనను విరమించుకోవాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని సిపిఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. సిపిఎం, అంబర్‌పేట మూసీ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గోల్నాక డివిజన్‌లోని మూసీ పరివాహక ప్రాంతంలో ఎన్నో ఏండ్లుగా పేదలు చిన్న చిన్న ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూలుస్తామనడం సరికాదన్నారు. పైసా పైసా కూడబెట్టుకుని స్థలం కొని ఇళ్లు నిర్మించుకున్నారని, వాటిని తొలగించకుండా మూసీని అభివృద్ధి చేయాలని సూచించారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు మహేందర్ మాట్లాడుతూ.. 2000లో వచ్చిన వరదలకు కూడా ఇండ్లు మునగలేదని, చాలా ఎత్తు ప్రదేశాల్లో ఇండ్లు ఉన్నాయని తెలిపారు. వారి వద్ద ఇంటి స్థలం పట్టా, ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని, ప్రభుత్వానికి కరెంట్ బిల్లు, నల్లా బిల్లు, ప్రాపర్టీ ట్యాక్స్ కడుతున్నారని చెప్పారు. హైడ్రా పేరుతో ఇళ్లను కూల్చే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. మూసీ బాధితులు మాట్లాడుతూ.. తమను నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు పంపిస్తామని చెబుతున్నారన్నారు. కానీ తాము ఊర్లో పొలాలు, బంగారం అమ్ముకొని, బ్యాంకు లోను తీసుకొని ఇక్కడ ఇండ్లు కట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికీ ఇళ్ల అప్పు తీరలేదన్నారు. ప్రభుత్వం హైదరాబాద్ అభివృద్ధి, మూసీ అభివృద్ధి పేరు చెప్పి ఇండ్లను తొలగిస్తే పేదల బతుకులు వీధిన పడే ప్రమాదం ఉందని, తమకు ఆత్మహత్య తప్ప వేరే మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట మూసీ నివాసితుల సంఘం కమిటీ సభ్యులు జి.రాములు, ఉమాదేవి, మల్లేష్ గౌడ్, దుర్గ, మహేష్, పసాద్, ప్రజలు పాల్గొన్నారు.

# కూల్చివేతలు కాదు.. చెరువుల పునరుద్ధరణ లక్ష్యం

- మూసీకి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదు
- కమిషనర్ రంగనాథ్ ప్రకటన

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

కూల్చివేతలు లక్ష్యం కాదు.. చెరువుల పునరుద్ధరణే హైడ్రా లక్ష్యమని కమిషనర్, ఐజీ ఎవి రంగనాథ్ తెలిపారు. మూసీ సుందరీకరణలో భాగంగా నది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాలను కూల్చివేయాలని సర్కారు నిర్ణయించడం, ఆ ఇండ్లకు మార్కింగ్ చేస్తుండటంతో బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం కీలక ప్రకటన చేశారు. మూసీ నదికి ఇరువైపులా చేస్తున్న సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదన్నారు. మూసీ నది పరిధిలో నివసిస్తున్న వారిని హైడ్రా తరలించడం లేదని, నదిలో ఎలాంటి కూల్చివేతలూ చేపట్టడం లేదని అన్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని ఇండ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని, మూసీ సుందరీకరణ అనేది ప్రత్యేక ప్రాజెక్టు అని చెప్పారు. దానిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని వెల్లడించారు. పేదలు, మధ్య తరగతి ప్రజల ఇండ్లను హైడ్రా కూల్చివేయదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని, అసత్య ప్రచారాలు నమ్మొద్దని పేర్కొన్నారు. హైడ్రా పరిధి ఔటర్ రింగ్ రోడ్డు వరకేనని స్పష్టం చేశారు. నగరంలోనే కాదు, ఇతర రాష్ట్రాల్లో కూల్చివేతలను కూడా హైడ్రాకు ఆపాదించి సామాజిక మాధ్యమాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. కూల్చివేతలన్నీ హైడ్రావి కావని, ప్రజలు గుర్తించాలని అన్నారు. ప్రకృతి వనరుల పరిరక్షణ, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటం, వర్షాలు, వరదల సమయంలో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా హైడ్రా చర్యలు తీసుకుంటుందన్నారు.

# సాహితీ ఇన్‌ఫ్రాటెక్ ఎమ్‌డికి 14 రోజుల రిమాండ్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సాహితీ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ లక్ష్మీనారాయణకు నాంపల్లి సెషన్స్ జడ్జి 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించారు. ఇడి అధికారులు సోమవారం లక్ష్మీ నారాయణను చంచల్‌గూడ జైలుకు తరలించారు. 14 రోజుల పాటు తమకు కస్టడీకి అనుమతించాలని, ఇడి అధికారులు పిటిషన్ ఫైల్ చేశారు. మంగళవారం కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని సాహితీ ఇన్‌ఫ్రా ఎండీ లక్ష్మీనారాయణ తరపు న్యాయవాదికి జడ్జి సూచించారు. స్థిరాస్తి ప్రాజెక్టుల పేరుతో పలువురు వినియోగదారుల నుంచి రూ.కోట్లలో డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు రావడంతో ఇడి కేసు నమోదు చేసింది. రూ.1800 కోట్లకు పైగా వసూలు చేసిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్‌పై మనీలాండరింగ్ చట్టం కింద ఇడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.